# ఆలాపన

త్రల్లి పోయేటప్పటికి రత్తమ్మకి నిండా పదేళ్లు లేవు. ఏడుస్తూ కూర్చున్న పిల్లని బలవంతాన యివతలికి లాగి, గూడెం వాళ్లు దహన క్రియలు పూర్తిచేశారు. రత్తమ్మ ఆ రోజల్లా ఏడుస్తూనే వుంది. అయితే ఏమని ఏడుస్తోందో, ఎందుకు ఏడుస్తోందో దానికి స్పష్టంగా తెలీదు. తెలిసినంతవరకూ అమ్మ తనతో శాగినించి మాట్లాట్టం మానేసింది. తను పిలిచినా పలకదు. కొట్టినా కదలదు. ఊరికే నేలమీద పడుకొనుంటే తన కేం అర్థం కాక ఏడుపు మొదలెట్టింది. రాత్రి క్రమ క్రమంగా గడుస్తోంది. అర్ధరాత్రి వేళకి చుట్టుపక్కల గుడిసెల్లో వాళ్లు రత్తమ్మ ఏడుపు విని పోగయ్యారు. "ఏమే రత్తీ అట్లా ఏడుస్తున్నావు?" అంటూనే తడిక తోసుకుంటూ లోపలికి వచ్చి ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు. అంతా ఒక్కసారి నిట్టూర్చి, "అదృష్టవంతురాలు, మంచానపడి తీసుకోకుండా పోయిగా, తన కాళ్ళమీద తను జీవిస్తూ విశ్రాంతిగా చచ్చి పోయింది" అనుకున్నారు. "అకాలమైన చావు అయినప్పటికీ చావంటే అలాపుండాలి" అన్నా రందరూను. ఏమంటే రత్తమ్మ తల్లికి నిండా ముప్ఫైయేళ్లు లేవు. మొగుడయినా పోయి నేడే పోయాడు. అప్పట్నుంచీ ఒంటరిదే పని మనిషిగా, రెండు బక్క ప్రాణాలనూ కాపాడుకొంటూ వస్తోంది. ఈనాటికి తీరు అయింది. అదృష్టం కాక మరేమిటి? దరిద్రంలో పుట్టి దరిద్రంలో పెరుగుతూ దరిద్రం తోనే పొట్టలు నింపుకొంటూ రోగాలు రాకుండా మంచంమీద పడి లేచే ఓపిక లేక కని పెట్టి వుండేవాళ్లూ, మందూ మాకూ యిచ్చే దాకర్లూ లేకుండా యమయాతన పడుతూ— సంతానాన్ని వొదల్లేక—పుట్టెడు కోరికలు మనసులో మెదులుతూండగా ప్రాణాలు పోవటంకన్నా యీ తీరుగా సుఖమరణం కాకుండా పడుకున్నది పడుకున్నట్టు ఊపిరి పీలవటం ఆపేసింది—అదృష్టం కాక మరే మిటి? రత్తమ్మ తల్లి చావుని గురించి గూడెంలో





'శ్రీ విరించి'

యింతే అనుకున్నారు. అందులో చాలా మంది. చావు రోజుల్లోనూ తప్పదు గనక తమకూ యిలాంటి చావే ప్రసాదించమని దేవుణ్ణి కోరుకున్నారు. మనుష్యుల్లో ఈ అదృష్టం అందరికీ రావద్దా—అని నిట్టూర్చుకున్నారు.

రత్తమ్మ తల్లిని శ్మశానానికి తీసుకువెళ్ళాక ఎవరో ముసలిత్తల్లి వచ్చి రత్తమ్మని తన యింటికి తీసుకువెళ్ళింది. ఆడవాళ్లు దాన్ని బోలెడు ప్రశ్నలు వేశారు. ఆ ప్రశ్నలకు జవాబులు చెప్పటమేనా కుదిరింది కాదు. ఎండ బారెడు పొద్దెక్కింది. రత్తమ్మ ఆ అమ్మ పోసిన గుక్కెడు గంజీ తాగి విశ్రాంతిగా పక్కా మంచంమీద కూలబడింది. 'అమ్మ చచ్చి పోయింది. అమ్మని ఎక్కడికో తీసుకెళ్లారు. అమ్మ మళ్ళీ రాదు. ఇంక తనకి అమ్మ లేదు—' యీ ఆలోచనల్లో దేని మొదలు తెలీక సతమతమవుతోంది రత్తమ్మ లేత బుర్ర.

కాస్త విశ్రాంతి చిక్కాక, రత్తమ్మని గురించి ఆలోచించారు. గూడెంలో వాళ్లు

(మిగత 68 వ పేజీలో)

# ఆలాపన

(30 వ పేజీ తరువాయి)

వచ్చిన చిక్కేమిటంటే, రత్తమ్మకు నా అనే వాళ్లు లేకపోలేదు. తనదని చెప్పుకోదగ్గ యిల్లు లేకపోలేదు. ఈ వూరికి నాలుగు కోసుల దూరాన్నే రత్తమ్మ పినతల్లి వుంటున్నది. దానికి మగడూ పిల్లలూ సంసార జంజాటం అంతా వున్నది. ఎప్పుడో సంవత్సరానికోసారి వచ్చి అక్కని చూచిపోతూంటుంది. అసలు రత్తమ్మ తండ్రి పోయినప్పుడే దాని పింతల్లి వచ్చి అక్కనీ కూతుర్నీ తన వూరు రమ్మని పరి పరి విధాల చెప్పింది: 'ఇంక నీకీ వూళ్ళో ఏం వున్నది కనక? ఇల్లంటావా—యిదేం గొప్ప ఆస్తి కాదు గద. అమ్మేస్తే పాతికో పరకో వస్తాయి. నువ్వూ నీ పిల్లా వొచ్చి మాతో పాటే వుండండి. మాకేం ఆస్తి వున్నదని రమ్మంటూన్నావు అంటావేమో—మీరూ మాతో పాటే కష్టం చెయ్యండి. అందరం కలిసే కలో గంజో తాగుదాం. కష్టం చేసేవాళ్ళకు ఏ వూరయితే నేమిటి?' అన్నది అక్కతో. అయితే, రత్తమ్మ తల్లి యిందుకు వొప్పలేదు. 'ఆయన ఉన్నన్నాళ్ళూ ఒక్కనాడూ పొరుపు లేకుండా యీ కొంపలో కాపురం చేశాను. ఆయన పోగానే దిక్కుమాలిం దానిలా యిల్లు అమ్ముకుని పరాయి పంచకు పోతే ఆయన నామీద కోపగిస్తాడు చెల్లీ! నేనయినా యింకా ఎన్నాళ్ళో బతుకుతానని లేదు. ఆ పైన ఏం జరిగేది మనకు తెలీదు. నా తను వున్నన్నాళ్ళు యీ గుడిసెనే అంటిపెట్టుకు వుంటాను' అన్నది. చెల్లెలు యింకేమీ అనలేకపోయింది. ఈనాటికీ పరిస్థితి ఏర్పడింది.

అక్క పోయినట్లు కబురందగానే రెక్కలు కట్టుకు వొచ్చినట్లయింది—చెల్లెలు. పింతల్లిని చూడగానే రత్తమ్మ బావురుమన్నది. మామూలు ఏడుపులన్నీ అయినాక, రత్తమ్మని తనతో తీసుకెడతానన్నది పింతల్లి, గూడెం వాళ్ళతో. అది యీ మాట అంటుందని అందరూ యెరుగుదురు. ఇల్లాంటి దేదో జరగటమే లోకంలో సహజం. రత్తమ్మ పింతల్లి వెంట తల వొంచుకుని పిల్లలా వెళ్ళింది. వెళుతూండగా వాళ్ళంతా దానికి ఘనంగా వీడ్కోలిచ్చారు. 'ఈ గుడిసెకింద నీ అమ్మా నాన్నా కలకాలం కాపురం చేశారు. నువ్వు కూడా పెద్ద దానివయాక యిక్కడికే వొచ్చి నీ అమ్మా నాన్నా ప్రతిష్ఠ కాపాడవే రత్తమ్మా!' అన్నారు. ఆ మాటలు రత్తమ్మకి అర్థం కాలేదు. ఎవరు ఏమని పలకరిస్తున్నా దానికి ఏడుపే వస్తోంది. పింతల్లి వడిలో పిల్లగా తలదూర్చి [illegible] ఏడుస్తోంది. రత్తమ్మ పింతల్లి యింటికి వెళ్ళటం యిదే మొదటిసారి. పక్క వూరికి వెళ్ళి తల్లి దండ్రి లేని అప్పకూతుర్ని తీసుకొచ్చిందని తెలిసి వాడలో జనమంతా పింతల్లి యింటి చుట్టూ చేరి ఏవి ఏమిటో మాట్లాడటం, తనని ఓదార్చటం కాసేపు రత్తమ్మకి తమాషాగానే కనిపించింది. అసలు యింతవరకు పూర్వం యింత మంది జనాన్ని ఒక్కచోట చూడలేదు. విడివిడిగా ఎంతోమందిని చూచినా, అందరూ కలిసికట్టుగా ఒకచోట చేరటం చూచే అవకాశం దానికి యీ తరుణంలోనే గాని ఏర్పడింది కాదు. ఒక్కొక్కళ్లుగా వాళ్ళంతా వెళ్ళిపోయిన తర్వాత రత్తమ్మ మళ్ళీ ఒంటరిగా మిగిలిపోయింది. కాకపోతే రత్తమ్మ చుట్టూ దానికంటే వయసులో చిన్నవాళ్ళయిన పింతల్లి కూతుళ్లు యిద్దరున్నారు. వాళ్ళతో ఏం మాట్లాడేందుకూ రత్తమ్మకి ఏమీ తెలీదు. దాని కెంతసేపూ తన వూరూ తన తల్లీ గుర్తొస్తున్నాయి. మనసులో ఒకటే బెంగ. బయటికి రాదు. ఒక్కసారిగా బావురని ఏడిస్తే యీ బరువు తగ్గుతుందేమో ననిపిస్తుంది గాని, ఎంతసేపు ఏడ్చినా—ఆ బాధ అలాగే వుంటుంది. కాని యేం చేసినా తన తల్లి మళ్ళీ రాదుట. ఈ మాట మరీ యేడుపు తెప్పిస్తోంది రత్తమ్మకి.

రత్తమ్మ పింతల్లి కూలికి పోతూండేది. ఎక్కడయినా పని దొరికితే చేస్తూండేది. అన్ని చోట్లకూ రత్తమ్మని వెంటబెట్టుకొని పోయేది. దాని పినతండ్రి మిల్లులో పని చేస్తాడు. మిల్లులో పని చాలకష్టం అని పింతల్లి అంటూండగా రత్తమ్మ విన్నది. దాని జ్ఞానానికి పింతండ్రి ఎప్పుడో మిలులో పని చేస్తూనే చచ్చిపోతాడని తోచింది. ఏమంటే అదే మిల్లులో పని చేస్తోన్న వాళ్ళని గురించి చావు కబుర్లూ చెయ్యి కాలు పోయి జీవచ్ఛవాల్లా బతికాల్సిన సంగతులూ అనేకం విన్నది తను. అందుకనే కాబోలు, పింతల్లి తనకు తోచినప్పుడల్లా మొగుడితో మిల్లుపని మానేసి యింకేమన్నా చూచుకోమని చెబుతూంటుంది. దాని కతను 'యిది మానేస్తే యిక రిక్షా లాగటమే గతి. ఉన్నన్నాళ్లూ చల్లగా యీ వుద్యోగమే చెయ్యనివ్వు' అంటాడు.

"అట్లాగయితే, దీనికన్నా రిక్షా లాగటమే లక్షరెట్లు నయం—" అనేది ఒక్కొక్కప్పుడు పింతల్లి. 'ఇంత బతుకూ బతికి రిక్షా లాగటమా?' అనేది ఒక్కోసారి. రత్తమ్మకి మాత్రం రిక్షా లాగటం తమాషాగా అనిపించింది మొదట ......కాని తీరా ఆలోచిస్తే అంతకన్నా తిండిలేక మాడి చావటమే నయమనిపించింది. ఈ మాటలన్నీ పింతల్లి దగ్గర అంటే 'అప్పుడే నీకెన్ని ఆలోచనలే, నిండా పధ్నాలుగేళ్లు లేవు?' అనేది.

రోజులు గడిచిన కొద్దీ రత్తమ్మకి ప్రపంచ జ్ఞానం కలగసాగింది. ఈ బతుకు లేమిటో డబ్బుకోసం జనం పెంపర్లాడట మేమిటో ఆలోచించ గలిగింది. ఈ సమయానికి పింతల్లికి రత్తమ్మ నో యింటిదాన్ని చేసి తన బాధ్యత పూర్తయిందీ—అనిపించుకోవాలనిపించింది.

రత్తమ్మకి పెళ్ళి చెయ్యటం పింతల్లి కేమీ సమస్యగా తోచలేదు. ఏమంటే, రత్తమ్మ కురూపి కాదు. చక్కటి బొమ్మ. దొరికితే దొరసానిలా తయారవుతుంది. సందేహం లేదు. ఆ వూళ్ళోనే వుండి—కాయకష్టం చేసుకుంటూండే ఓ కుర్రాడితో రత్తమ్మకి ముడి వేసే బావుంటుందని పింతల్లి అనుకుంది. రత్తమ్మ యిందుకేమీ అభ్యంతరం తెలపలేదు.

ఒక సుముహూర్తాన కులాచార ప్రకారం రత్తమ్మ వివాహం పూర్తయింది.

రత్తమ్మని చేసుకొన్నవాడికి ఆస్తిపాస్తులంటూ యేమీ లేవు. ఈ వూళ్ళో యాదృచ్ఛికంగా వుంటున్నాడు. పెళ్ళయిన కొన్ని రోజులదాకా అతనూ రత్తమ్మతో పాటే ఆమె పింతల్లి యింట్లోనే వున్నాడు. రత్తమ్మకే యిదేమీ బావున్నట్టు తోచింది కాదు. తన కా వూళ్ళో పితార్జితం అంటూ ఓ కొంప వుండనే వున్నది. ఇట్లా ఎన్నాళ్లు తను పింతల్లి యింట్లో వుండిపోవాలి?—యిక్కడ తన కేం లోటు జరుగుతున్నదని కాదు, ఎక్కడికి వెళ్ళినా తమ జాతకాలింతేనని దానికి రూఢిగా తెలుసు. తన తల్లిదండ్రుల ప్రతిష్ఠ కోసం తన వూరికి కాపురం చేస్తే బాగుంటుందనిపించింది.

ఈ మాటే సమయం చూసి పింతల్లితో కదిపింది. ఆమె పాటపాటే పాడింది. 'ఒక్క దానివీ వెళ్ళి ఆ పాడుబడ్డ యింట్లో వుండటం? పోతే నేమ—యిక్కడే మాతో పాటు....' అని. రత్తమ్మ ససేమిరా అన్నది. తన తల్లి అభిమానం గుర్తు తెచ్చుకు మరీ మంకుపట్టు పట్టింది. ఇక పింతల్లి చేసేదిలేక 'నీ యిష్టమే రత్తమ్మా, నువ్విట్లాగా ఒకనాడు యీ మాట అంటావని నాకు ముందే తెలుసు. నీ అమ్మది పుట్టెడు అభిమానం. నీకూ అంతే. అయినదాన్ని దగ్గరున్నాను. కనక కష్టకాలంలో ఆదుకున్నాను. అప్పుడప్పుడూ నువ్వూ, నీ మగడూ వొచ్చి చూచిపోతూంటే సంతోషిస్తాను. ఇంక యీ యిల్లు కదిలే వోపిక నాకు లేదు' అన్నది.

ఆ సాయంత్రమే రత్తమ్మ మొగుణ్ణి వెంటబెట్టుకుని తన తల్లిదండ్రి వుండి వుడిగిన వూరికి వెళ్ళింది.